



# సామూహిక కుంకుమ పూజలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలోని అంజనీ పుత్ర ఎస్టేట్ 100 ఫీట్ల రోడ్డులో శుక్రవారం కన్నులపండుగగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. మహి ళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.వేద పండితుల ఆధ్వర్యంలో గణనాథునికి పుణ్యాహవచనం, మండపారాధనతో పాటు పంచామృతాలతో అభిషే కం చేశారు. అనంతరం మహిళలు కుంకుమ పూజలో పాల్గొని వాయనాలు ఇచ్చిపుచ్చుకొని కోలాటాలు ఆడారు.ఈ సందర్భంగా అంజనీపుత్ర ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్, మేనేజింగ్ డైరెక్టర్ పిల్లి రవి అధ్యక్షతన గణనాథుని విగ్రహానికి రూ.15 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. “తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు వినాయక చవితి పండుగ అద్దం పడుతుంది. అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకునే పండుగ ఇది” అని చైర్మన్ తెలిపారు.తరువాత 3 వేల మందికి మహా అన్నదానం నిర్వహించారు. మహిళలు స్వయంగా భక్తులకు అన్నం వడ్డించారు.ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సూరినేని కిషన్, కాసర్ల సదానందం, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## ఓరియంట్ సిమెంట్ ఎన్నికల్లో ఎస్పీఆర్ ఘన విజయం



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (తరాజు గుర్తు) అభ్యర్థి కొక్కిరాల సత్యపాల్ రావు ఘన విజయాన్ని సాధించారు. శుక్రవారం జరిగిన పోలింగ్ లో మొత్తం 266 ఓట్లకు గాను 265 మంది కార్మికులు ఓటు వేశారు. వీరిలో 9 మంది ట్రైనీ కార్మికులు సీల్డ్ కవర్ విధానంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. లెక్కింపులో సత్యపాల్ రావు 141 ఓట్లు సాధించగా, తన సమీప పోటీదారు లోకల్ ఓరియంట్ సిమెంట్ ఎంప్లాయ్మెంట్ వర్కర్స్ యూనియన్ (పెద్ద పులి గుర్తు) అభ్యర్థి పుస్కూరి విక్రమ్ రావు 108 ఓట్లు పొందారు. దీంతో 33 ఓట్ల మెజార్టీతో సత్యపాల్ విజయం సాధించారు. ఇక ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్ యూనియన్ (చక్రం గుర్తు) అభ్యర్థి తాట్ర భీమ్ రావు 6 ఓట్లు, మరో అభ్యర్థి ఒకే ఓటు సాధించారు. పోలైన ఓట్లలో ఒకదాన్ని చెల్లనిదిగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి ఓటు వేసిన కార్మికుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని, వారి సమస్యల పరిష్కారం కోసం అండగా ఉంటానని సత్యపాల్ రావు తెలిపారు.




# సిమెంట్ ఫ్యాక్టరీ ఎన్నికల్లో సంచలనం

- మంత్రి వివేక్ వర్సెస్ ఎమ్మెల్యే పి ఎస్ ఆర్
- పట్టు నిలబెట్టుకున్న ప్రేమ్ సాగర్ రావు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

చిన్న ఎన్నికగా కనిపించిన దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మిక సంఘం ఎన్నికలు, చివరకు కాంగ్రెస్‌లో పెద్ద రాజకీయ పోరాటానికి వేదికయ్యాయి. మంత్రి వివేక్ వర్గం – ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు వర్గం మధ్య ప్రతిష్టాత్మకంగా సాగిన ఈ పోరులో, విజయాన్ని ప్రేం సాగర్ రావు వర్గం సాధించింది.ఎన్నికలో ప్రేంసాగర్ రావు సోదరుడు కొక్కిరాల సత్యపాల్ రావు గెలుపొందారు. మంత్రి వివేక్, ఆయన అన్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కలిసి పూస్కూరి విక్రమ్‌ను రంగంలోకి దింపగా, ప్రేంసాగర్ రావు ముందుగానే తన తమ్ముడు సత్యపాల్‌ను అభ్యర్థిగా నిలబెట్టారు.విక్రమ్ అభ్యర్థిత్వం వెనుక ఉద్దేశ్యం ప్రేంసాగర్ ప్రభావాన్ని బలహీనపరచడమేనని కాంగ్రెస్ వర్గాలు వ్యాఖ్యానించాయి. కానీ సత్యపాల్ ఇప్పటికే చాలాకాలంగా దేవాపూర్ కార్మికులతో మమేకమై పనిచేస్తుండటంతో ఆయనకు బలమైన మద్దతు లభించింది.ఎన్నికల సమయంలో ఇరువర్గాలు భారీగా ఖర్చు చేసి, క్యాంపు రాజకీయాలు, మందు–విందులతో ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నించాయి. ఓటర్లను క్యాంపులకు తరలించడం, తేదీలు మారినప్పుడల్లా తిరిగి వారిని సమీకరించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి.



దాదాపు వారం రోజుల పాటు మంత్రి వివేక్ అనుచరులు దేవాపూర్లో మకాం వేసి పోటీని హైటెన్షన్‌గా మార్చారు.అయితే తుది ఫలితం మాత్రం ప్రేంసాగర్ వర్గానికే అనుకూలించింది. దీంతో మంత్రి వివేక్, వినోద్, వెద్మ బొజ్జుల వర్గం పరోక్షంగా ఓటమి చవిచూసినట్లైంది. పార్టీ వర్గాల్లో ఇది ఒక రకంగా మంత్రి వివేక్ ఓటమిగానే పరిగణిస్తున్నారు.ఇక సొంత పార్టీలోనే వివేక్ తీసుకున్న నిర్ణయంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన విక్రమ్‌ను అభ్యర్థిగా నిలబెట్టడం వ్యూహపరంగా తప్పిదమని శ్రేణులు అభిప్రాయపడుతున్నాయి. సత్యపాల్‌కు మద్దతు ఇచ్చి ఉంటే పార్టీలో గౌరవం పెరిగేదని, వివేక్ మరోసారి రాజకీయ పొరపాటు చేశారని నేతలు చెబుతున్నారు.






## వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పీ చంద్రయ్య

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య సూచించారు. శుక్రవారం ఆయన బెల్లంపల్లి మండల కేంద్రంలోని వెనుకబడిన తరగతుల ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల వసతి గృహాన్ని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిద్రించే గదులు, భోజనశాల, వంటశాల, సామాగ్రి నిల్వ ప్రదేశాలను పరిశీలించి, విద్యార్థులతో కలిసి ఉపహారం తీసుకున్నారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పిస్తున్నామని, మీ భవిష్యత్తు నిర్మాణం మీ చేతుల్లోనే ఉందని, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులను ప్రోత్సహించారు. తదుపరి భీమిని మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉల్లాస్ కార్యక్రమంలో కలెక్టర్, పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు. 15 ఏళ్లు పైబడిన నిరక్ష రాస్యులకు విద్య అందించేందుకు వలంటరీ టీచర్లు కృషి చేయాలని సూచిం చారు. 10వ తరగతి పూర్తి చేయని వారిని తెలంగాణ ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీ డియట్ చదువుకు ప్రోత్సహించాలని తెలి పారు. జిల్లా స్థాయిలో నవభారత సాక్షరత కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి నిరక్ష రాస్యతను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెల్లడించారు.

## ఓటరు జాబితా స్పష్టతపై దృష్టి

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితా ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య సూచించారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావుతో కలిసి పంచాయతీ శాఖ అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ – ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలను ఆగస్టు 31లోపు పరిష్కరించాల్సి ఉంటుందని, ఆగస్టు 30న మండల స్థాయిలో మాదిరీ సమావేశాలు నిర్వహించాలని తెలిపారు. వార్డు, గ్రామపంచాయతీ ఓటర్ల మార్పులపై అభ్యంతరాలు కూడా ఆ తేదీలోపు సమర్పించాలని సూచించారు. సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు వివరించారు. జిల్లాలోని 16 మండలాల్లో 306 గ్రామపంచాయతీలు, 2,680 వార్డులు ఉన్నాయని, ప్రస్తుతం 1,85,643 మంది పురుషులు, 1,91,111 మంది మహిళలు, 15 మంది ఇతరులు ఓటర్లుగా నమోదు అయ్యారని తెలిపారు. స్థానిక ఎన్నికల ఫేజ్–1, ఫేజ్–2లో తలా 1,340 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, 650 మందికి పైగా ఓటర్లు ఉన్న చోట సహాయ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. తుది జాబితా తయారీలో అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించడమే ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. అధికారులు పాల్గొన్నారు.

## రజకుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

- సింగరేణి హామీలు అమలు చేయకపోవడంతో ఆవేదన



**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

“సింగరేణి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో రజకుల జీవనోపాధి దెబ్బతింది, మా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి” అని రజక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సింగపూర్, తాళ్లపల్లి గ్రామాల్లో రజకుల భూములు సింగరేణి ఓపెన్‌కాస్ట్ తవ్వకాలకై స్వాధీనం చేసుకున్నప్పటికీ ఇప్పటికీ కొంతమంది పునరావాస–పునర్వసతి ప్యాకేజీకి నోచుకోలేదని తెలిపారు. సింగపూర్‌లోని ధోబీఘాట్‌ను ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కూల్చివేయడంతో కులవృత్తులు దెబ్బతిన్నాయని, చెరువులు కూడా పనికిరాకుండా పోయాయని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చిన ధోబీఘాట్‌ను తిరిగి నిర్మించకపోవడంతో పాటు రజక కమ్యూనిటీ హాలు, మడేలయ్య గుడి, ధోబీఘాట్‌లకు ఎలాంటి పరిహారం ఇవ్వలేదని తెలిపారు. కొంతమందికి జీవో ప్రకారం అందాల్సిన నిధులు, గృహ స్థలాలు అందలేదని పేర్కొన్నారు. నష్టపోయిన కుటుంబాలకు తగిన పరిహారం చెల్లించడంతో పాటు కమ్యూనిటీ హాలు, ధోబీఘాట్, మడేలయ్య గుడిని వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే జీఎం కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ముస్కే చందర్, జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు నడిగోడ తిరుపతి, పట్టణ అధ్యక్షుడు గంగరాజుల రాంచందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండపర్తి రవి, నాయకులు కొండపర్తి బాపు, పాయిరాల ఇందుర్, పాయిరాల పుల్లయ్య, కొండపర్తి లచ్చన్న, పాయిరాల సరిత, కొండపర్తి లక్ష్మి, కొండపర్తి మమత, పాయిరాల లక్ష్మి, పాయిరాల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యువతకు ఉచిత శిక్షణ

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

గ్రామీణ ప్రాంతాల గిరిజన నిరుద్యోగ యువత కోసం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో డి. డి. యు.–జి. కె. వై. క్రింద ఉచిత శిక్షణ మరియు హాస్టల్ వసతి తో ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతున్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి జనార్ధన్ తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్ (టాలీ) కోర్సుకు బి.కాం. ఉత్తీర్ణత, కంప్యూటర్ హార్డ్ వేర్ అసిస్టెంట్ కోర్సుకు ఇంటర్ ఉత్తీర్ణత, ఆటోమొబైల్ 2 వీలర్ సర్వీసింగ్ కోర్సుకు 10వ తరగతి ఉత్తీర్ణత, సోలార్ సిస్టమ్ ఇన్స్టాలేషన్, సర్వీస్ కోర్సుకు 10వ తరగతి/ఐ.టి.ఐ. ఉత్తీర్ణత ఉండాలి. అభ్యర్థుల వయసు 15–30 సంవత్స రాల మధ్య ఉండాలి. వారు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన గిరిజ న యువకులు కావాలని సూచించారు. కోర్సులు 105 రోజులపాటు జ రుగుతాయి. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 1వ తేదీకి విద్యార్హత ధ్రువపత్రాల నిజప్రతులు, ఒక జత నకలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్, రేషన్ కార్డులు తీసుకొని యాదాద్రి భువనగిరి జిల్లా, పోచంపల్లి మండలం, జలాల్పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని జనార్ధన్ తెలిపారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**

ప్రజా సంక్షేమ కార్యక్రమాల భాగంగా చేపట్టిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం ఆయన కన్నేపల్లి మండల కేంద్రంలో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ముఖ్యమైనవని, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయడం ద్వారా ప్రజా సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులు, సామాజిక, ప్రాథమిక, ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు సమగ్ర వైద్య సేవలు అందించబడుతుందని చెప్పారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకుంటూ, ప్రత్యేక ఫీవర్ వార్డులు ఏర్పాటు చేసి జ్వర బాధితులకు వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణ పనులు త్వరగా పూర్తి కావడం కోసం అధికారులు, గుత్తేదారుల మధ్య సమన్వయం కొనసాగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గోల్డ్ లోన్ సంస్థల్లో పోలీసుల సోదాలు...



**శెనార్తి మీడియా, మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎస్‌బీఐ శాఖలో ఇటీవల వెలుగులోకి వచ్చిన రూ.13.61 కోట్ల బంగారం మోసం కేసు దర్యాప్తు వేగవంతం అవుతోంది. ఈ నేపథ్యంలో మంచిర్యాల పట్టణంలోని గోల్డ్ లోన్ సంస్థలు, ఫైనాన్స్ కార్యాలయాల్లో పోలీసులు శుక్రవారం ఆకస్మిక సోదాలు చేపట్టారు. ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ లిమిటెడ్, ముత్తూట్ గోల్డ్ లోన్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు మరో ఎనిమిది గోల్డ్ లోన్ కంపెనీల్లో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో సీఐలు, ఎస్‌ఐలు ప్రత్యేక బృందాలు ఏర్పడి తనిఖీలు నిర్వహించాయి. జిల్లా కేంద్రాల్లో సోదాలు జరగడంతో పట్టణంలో హడావుడి వాతావరణం నెలకొంది. పెద్ద ఎత్తున పోలీసులు మోహరించడంతో ప్రజలు కాసేపు ఆందోళనకు గురయ్యారు.